వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 077
పేజీలు : 06 | వెల: రూ.5/-
శనివారం
మార్చి 07, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


2లో..

## ఐపీఎస్‌గా ఎంపికైన ఎస్ఐ కుమారుడు

- అఖిలేశ్ గుండుకు 464వ ర్యాంకు



# సామాన్యుడికే.. సంక్షేమ పథకాలు

- అధికారులకు ఎంపీ, ఎమ్మెల్యేల ఆదేశం
- సర్కారు బడికి 'దిశా' నిర్దేశం
- విద్యా, వైద్యమే మా ప్రాధాన్యం
- యుద్ధ ప్రాతిపదికన పనులు




హనుమకొండ జిల్లా సమగ్ర అభివృద్ధి , సంక్షేమ పథకాల అమలు తీరుపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధ్యక్షతన నిర్వహించిన 'దిశా' సమావేశం కీలక నిర్ణయాలకు వేదికైంది. జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమీక్షలో ప్రజాప్రతినిధులు మరియు అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రభుత్వ ఫలాలు సామాన్యుడికి అందేలా చూడాలని ఎంపీ దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా విద్యా, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, పదో తరగతి ఫలితాల్లో జిల్లాను స్టేట్ టాపర్‌గా నిలపడం, మరియు విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలపై అధికారులను ఆదేశించారు. అలాగే, వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని, మిషన్ భగీరథ పనులను యుద్ధ ప్రాతిపదికన పర్యవేక్షించాలని సూచించారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు తదితరులు పాల్గొని స్థానిక సమస్యల పరిష్కారానికి, ముఖ్యంగా పాఠశాలల్లో వసతులు మరియు సాగునీటి సరఫరాపై పట్టుబట్టారు. సంక్షేమమే ధ్యేయంగా సాగిన ఈ సమావేశం జిల్లా ప్రగతికి ఒక స్పష్టమైన మార్గసూచీని అందించింది.

- వరంగల్ వాయిస్, హన్మకొండ

వివరాలు 2లో..

**సమగ్ర అభివృద్ధి సంక్షేమ పథకాల ముఖ్య అంశాలు**

| విభాగం | ప్రాధాన్యత అంశం |
|---|---|
| విద్య | 99 రోజుల ప్రణాళిక, 10వ తరగతి ఫలితాల్లో అగ్రస్థానం, సోలార్ ప్లాంట్లు. |
| వైద్యం | హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, విద్యార్థులకు హెల్త్ స్క్రీనింగ్. |
| మౌలిక వసతులు | పాఠశాలల్లో టాయిలెట్లు, తాగునీరు, రోడ్డు ప్రమాదాల నివారణ. పథకాలుపీఎం సూర్య ఘర్, మిషన్ భగీరథ సమర్థ నిర్వహణ. |


6లో..

## ములుగు మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తా

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- రూ.15 కోట్లతో అభివృద్ధి పనులకు టెండర్లు
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో వెల్లడి


5లో..

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- కార్యాలయాల్లో పరిశుభ్రత ఉండాలి
- క్షేత్రస్థాయిలో కలెక్టర్ దివాకర్ టీఎస్ తనిఖీలు


2లో..

## 'శ్రీ పరాభవ' నామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణ

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ చేతుల మీదుగా ఆవిష్కరణ


6లో..

## స్వచ్ఛ వరంగల్ లక్ష్యం



- చీపురు పట్టిన మంత్రి, మేయర్, కలెక్టర్
- మహిళా శక్తికి 'కుట్టు' మిషన్ల ఊతం
- మంత్రి కొండా సురేఖ




# సామాన్యుడికే సంక్షేమ పథకాలు

- అధికారులకు ఎంపీ, ఎమ్మెల్యేల ఆదేశం
- సర్కారు బడికి 'దిశా' నిర్దేశం
- విద్యా, వైద్యమే మా ప్రాధాన్యం
- యుద్ధ ప్రాతిపదికన పనులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆకాంక్షించారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఎంపీ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం.. జిల్లా ప్రగతిపై సుదీర్ఘ చర్చకు వేదికైంది. విద్యా, వైద్య రంగాల్లో జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు.

**బడి బాట పట్టాలి.. ఫలితాల్లో మేటిగా నిలవాలి!**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను పెంచడంపై ఎంపీ కావ్య ప్రత్యేకంగా నొక్కి చెప్పారు. "పదో తరగతి పరీక్షల్లో హనుమకొండ జిల్లా స్టేట్ టాపర్‌గా నిలవాలి. పరీక్షల సమయం వరకు విద్యార్థులకు స్నాక్స్ అందించాలి. బాలికల పాఠశాలల్లో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం టాయిలెట్లు, మౌలిక వసతులు కల్పించడంలో ఏమాత్రం అలసత్వం వహించవద్దు" అని స్పష్టం చేశారు. అలాగే, పీఎం సూర్య ఘర్ పథకం కింద అన్ని పాఠశాలల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి విద్యుత్ ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

**సమస్యలపై నిలదీత!**

సమావేశంలో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు . స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి జిల్లాలోని 400 పాఠశాలల్లో కేవలం 18 వేల మంది విద్యార్థులు ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రవేశాల నమోదు కోసం 'స్పెషల్ డ్రైవ్' చేపట్టాలని, నియోజకవర్గానికి కేటాయించిన ₹16 కోట్లతో పాఠశాలల్లో వసతులు మెరుగుపరచాలని సూచించారు. పంటలు ఎండిపోకుండా దేవాదుల ద్వారా సాగునీరు అందించాలన్నారు. డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ ప్రీ-స్కూల్స్ ఏర్పాటుపై దృష్టి పెట్టాలని, టీకాల పంపిణీలో 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని వైద్యులను కోరారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో హెల్త్ స్క్రీనింగ్ నిర్వహించి విద్యార్థుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని కోరారు. శాయంపేట మండల పాఠశాలల్లో తాగునీరు, కరెంటు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు డిమాండ్ చేశారు.

**తాగునీటి సమస్య ఉండొద్దు..**

వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ తెలిపారు. నగరంలో ఫిల్టర్ బెడ్ల మరమ్మతులు ఈ నెల 31లోగా పూర్తి చేస్తామని, మిషన్ భగీరథ ద్వారా నిరంతర సరఫరాకు ఏఈలను పర్యవేక్షకులుగా నియమించామని వెల్లడించారు. సమావేశం అనంతరం మహిళా చైతన్యం కోసం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ పోస్టర్‌ను, పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పోస్టర్లను ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, మేయర్ సుధారాణి, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, అదనపు కలెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## 'శ్రీ పరాభవ' నామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఓరుగల్లు ఇలవేల్పు భద్రకాళి అమ్మవారి సన్నిధానంలో 'శ్రీ పరాభవ' నామ సంవత్సర పంచాంగం శనివారం ఘనంగా ఆవిష్కృతమైంది. శ్రీ సోమేశ్వర ఆస్ట్రాలజికల్ సెంటర్ వ్యవస్థాపకులు, జ్యోతిష్య బ్రహ్మ శివశ్రీ కాళేశ్వరం సుమన్ శర్మ రూపొందించిన ఈ పంచాంగాన్ని వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ ఆవిష్కరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, తొలి పంచాంగాన్ని ఆగమ సామ్రాట్ భద్రకాళి శేషుకు అందజేశారు. ఈ సందర్భంగా సుమన్ శర్మ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో పంచాంగానికి విశిష్ట స్థానం ఉందన్నారు. తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాల సమాహారమే పంచాంగమని, ఇది విశ్వగోళ శాస్త్ర రహస్యమని పేర్కొన్నారు. "జ్యోతిషాం అయనం చక్షుః" అన్నట్లుగా వేద పురుషుడికి జ్యోతిష్య శాస్త్రం కన్ను వంటిదని వివరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ.. డాక్టర్ కాళేశ్వరం సుమన్ శర్మ జ్యోతిష్య శాస్త్రంలో అపార అనుభవం కలిగిన పండితులని కొనియాడారు. జ్యోతిషంలో 'ట్రిపుల్ పీహెచ్‌డీ' సాధించడమే కాకుండా వాస్తు, సంఖ్యాశాస్త్రం, వైద్య జ్యోతిష్యం వంటి అనేక విభాగాల్లో ఆయన నిష్ణాతులని పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో ఓరుగల్లు ప్రజలందరికీ శుభం కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు మరియు జ్యోతిష్య పండితులు పాల్గొన్నారు.

## ఐపీఎస్‌గా ఎంపికైన ఎస్ఐ కుమారుడు

☐ అఖిలేశ్ గుండుకు 464వ ర్యాంకు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తండ్రి రక్షణ శాఖలో సామాన్య అధికారిగా విధులు నిర్వహిస్తుంటే.. కొడుకు అదే శాఖలో ఉన్నత స్థాయి అధికారిగా (ఐపీఎస్) ఎంపికై తండ్రి గర్వంతో తల ఎత్తుకునేలా చేశాడు. హనుమకొండ జిల్లాకు చెందిన అఖిలేశ్ గుండు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్-2025 ఫలితాల్లో 464వ ర్యాంకు సాధించి ఐపీఎస్ హోదాను దక్కించుకున్నారు. భూపాలపల్లిలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న గుండు శివ కుమార్, సరస్వతి దంపతుల కుమారుడైన అఖిలేశ్ చిన్నప్పటి నుంచి చదువులో ప్రతిభ కనబరిచారు. ఆయన తన ప్రాథమిక విద్యను వరంగల్ పబ్లిక్ స్కూల్‌లో పూర్తి చేశారు. అనంతరం ఇంటర్మీడియట్ ఎస్ఆర్ కాలేజీలో చదివి, ప్రతిష్టాత్మక ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి సివిల్ ఇంజినీరింగ్‌లో పట్టా పొందారు. దేశ సేవ చేయాలనే పట్టుదలతో సివిల్స్‌కు సిద్ధమై, మొదటి ప్రయత్నంలోనే ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. ఐపీఎస్‌గా ఎంపికైనందుకు సంతోషంగా ఉందని తెలుపుతూనే, తన అంతిమ లక్ష్యం ఐఏఎస్ సాధించడమేనని అఖిలేశ్ పేర్కొన్నారు. మరోసారి పట్టుదలతో ప్రయత్నించి కలెక్టర్ కావాలనేది తన ఆశయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కుమారుడి విజయం పట్ల తండ్రి శివ కుమార్, కుటుంబ సభ్యులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పెన్షనర్లపై అబద్ధపు ప్రచారమా ?

**సీఎం వ్యాఖ్యలపై రిటైర్డ్ ఉద్యోగుల ధ్వజం**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రిటైర్డ్ ఉద్యోగులకు ఒక్కొక్కరికి కోటి రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉందంటూ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బకాయిల సాధన కమిటీ తీవ్రంగా ఖండించింది. శనివారం హనుమకొండలోని పీఆర్టీయూ భవనంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కందుకూరి దేవదాసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ నేతలు ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా కందుకూరి దేవదాసు మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి భోగేశ్వర్ మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి చెబుతున్నట్లుగా ఏ ఒక్క పెన్షనర్‌కు కూడా కోటి రూపాయల బకాయిలు లేవు. 30-40 ఏళ్ల సర్వీసును బట్టి, వారు దాచుకున్న జీపీఎఫ్, కమ్యుటేషన్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌కాష్‌మెంట్ వంటివి కలిపితే సగటున రూ.50 లక్షల వరకు మాత్రమే వస్తాయి. అవాస్తవాలు ప్రచారం చేస్తూ ప్రజల ముందు పెన్షనర్లను అబాసుపాలు చేయడం సరికాదు" అని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కొన్ని ప్రాజెక్టులపై నేతలు ఘాటుగా స్పందించారు. మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు, గాంధీ విగ్రహానికి రూ.5,000 కోట్లు, ఫోర్త్ సిటీ వంటి ప్రాజెక్టుల వ్యయాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ఆ నిధుల్లో కేవలం ₹10,000 కోట్లు కేటాయిస్తే రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలన్నీ తీరిపోతాయని గుర్తుచేశారు. మెరుగైన వైద్యం చేయించుకోవడానికి డబ్బులు లేక ఇప్పటి వరకు 75 మంది పెన్షనర్లు ప్రాణాలు కోల్పోయారని, వందలాది మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా మానవత్వంతో స్పందించి, రాబోయే బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించి ఏకమొత్తంలో బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ఎండీ అబ్దుల్ గఫార్, ఎం.దామోదర్, ఎస్.కుమారస్వామి, ఇ.ఇంద్రసేనారెడ్డి, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో పన్నులు చెల్లించాలి

☐ కలెక్టర్/బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగర ప్రజలు తమ ఆస్తి మరియు నల్లా పన్నులను సకాలంలో చెల్లించి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి తోడ్పడాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ కోరారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపునకు సమయం దగ్గరపడుతున్నందున, బకాయిలు ఉన్నవారు తక్షణమే పన్నులు చెల్లించాలని సూచించారు. పన్నుల వసూళ్లపై అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. శనివారం ఖాజీపేట సర్కిల్ పరిధిలో దీర్ఘకాలంగా పన్ను చెల్లించకుండా మొండికేస్తున్న ఒక గృహాన్ని కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ మాట్లాడుతూ.. పన్ను బకాయిలు ఉన్న గృహ యాజమాన్యాలకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేశామని తెలిపారు. అయినప్పటికీ స్పందించని వారిపై సీజింగ్ చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. నగరంలో మెరుగైన మౌలిక వసతులు, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యాల కల్పనకు పన్నుల రూపంలో వచ్చే ఆదాయమే ప్రధాన వనరు అని, ప్రజలు తమ బాధ్యతను గుర్తించి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు బాకం సంతోష్, శేహజాది బేగం, ఎస్ఎఫ్ఓ రాజేశ్వర్ రావు, ఆర్ఐ నరేష్, టాక్స్ డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** పరీక్షల వేళ విద్యార్థులకు అండగా నిలుస్తూ ఒక ఉపాధ్యాయ దంపతులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. డోర్నకల్ మండలంలోని కన్నెగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కోవిలా రాజేశ్వర్ – హైమవతి దంపతులు సుమారు 400 మంది విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. శనివారం డోర్నకల్, కన్నెగుండ్ల, మన్నెగూడెం పాఠశాలల విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు, స్కేళ్లతో కూడిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ.. తనకు ఇంకా ఆరేళ్ల సర్వీసు ఉందని, రిటైర్ అయ్యే వరకు ప్రతి ఏటా 500 మంది పేద విద్యార్థులకు ఈ విధంగా పరీక్షా సామాగ్రిని అందిస్తామని ప్రకటించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) అంగోత్ లక్ష్మా నాయక్ మాట్లాడుతూ.. విద్యార్థుల చదువుపై మక్కువతో ఉపాధ్యాయ దంపతులు చేస్తున్న ఈ సాయం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు మాధవరావు, వెంకట్రామణ, వాణిశ్రీ, వెంకన్న, పీబీ శ్రీను, రామకృష్ణ, రామ్మూర్తి, దస్తగిరి, లోకేందర్, నరేందర్, రాజేశ్వరి, ఉరియా, చంద్రశేఖర్, మెహబూబి, నాగుల తదితరులు పాల్గొన్నారు.




## వ్యవసాయ రంగాన్ని పరిశ్రమగా గుర్తించాలి

◻ సీపీఐ నాయకుల డిమాండ్

**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** భారతదేశం వ్యవసాయాధారిత దేశమైనప్పటికీ, రైతులకు సరైన గుర్తింపు, గిట్టుబాటు ధర దక్కకపోవడం దారుణమని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ధర్మసాగర్ మండలం శాయిపేటలో శాఖ కార్యదర్శి కనుకటి రాజయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా మద్దెల ఎల్లేష్, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ.. పరిశ్రమల్లో తయారయ్యే వస్తువులకు 'ఎమ్మార్పీ' ధర నిర్ణయించుకునే అవకాశం ఉన్నప్పుడు, రైతులు పండించే పంటలకు వారే ధర నిర్ణయించే విధానాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వ్యవసాయ రంగాన్ని పారిశ్రామిక రంగంగా గుర్తించి, దేశ రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరపై చట్టబద్ధమైన గ్యారెంటీ హక్కు కల్పించాలి. ఫసల్ బీమా, రైతు బీమా పథకాలను పకడ్బందీగా అమలు చేస్తూ రైతులకు భరోసా ఇవ్వాలి. ఉపాధి హామీ పథకాన్ని

## సివిల్స్‌లో 'తరుణ్ తేజ' సత్తా

- తరుణ్ తేజ విజయం యువతకు స్ఫూర్తిదాయకం
- సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఫలితాల్లో హనుమకొండ ప్రశాంత్ నగర్‌కు చెందిన తరుణ్ తేజ ఆల్ ఇండియా స్థాయిలో 123వ ర్యాంకు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ కొనియాడారు. శనివారం తరుణ్ తేజ నివాసానికి వెళ్లిన ఆయన, ఆదర్శ పాఠశాల నిర్వాహకులు శివ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు నరసింహారావులతో కలిసి విజేతను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ.. కఠోర శ్రమ, పట్టుదల ఉంటే సివిల్స్ వంటి అత్యున్నత శిఖరాలను అధిరోహించవచ్చని తరుణ్ తేజ నిరూపించారని ప్రశంసించారు. యువత తమ లక్ష్యాలను సాధించడానికి నిరంతర కృషిని కొనసాగించాలని, తరుణ్ తేజ విజయం నేటి తరానికి గొప్ప స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తరుణ్ తేజకు 'సాయి సచ్చరిత్ర' పారాయణ గ్రంథాన్ని బహూకరించి, భవిష్యత్తులో దేశానికి గొప్ప సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి కుటుంబ సభ్యులు, మిత్రులు, ఉపాధ్యాయులు పాల్గొని తరుణ్ తేజను అభినందనలతో ముంచెత్తారు.

# అన్నారంలో 'రెవెన్యూ' కొరడా

- ఆక్రమణల షెడ్డు కూల్చివేత!
- అక్రమార్కుల గుండెల్లో రైళ్లు
- ఫిర్యాదు అందితేనే చర్యలా?
- మిగిలిన వాటి సంగతేంటి?
- వివక్ష లేని సర్వేకు గ్రామస్తుల డిమాండ్



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** ప్రభుత్వ భూమి అంటేనే అలుసు.. అందినకాడికి దండుకుందామనే ఆక్రమణదారుల ఆటలకు పర్వతగిరి రెవెన్యూ అధికారులు చెక్ పెట్టారు. మండలంలోని పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రమైన అన్నారం దర్గా పరిసరాల్లోని సర్వే నంబర్ 489లో కొనసాగుతున్న భూ ఆక్రమణలపై శనివారం అధికారులు ఉక్కుపాదం మోపారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి విక్రయాలకు పాల్పడుతున్నారన్న పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి, వెలసిన అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు.

### అక్రమ షెడ్డు కూల్చివేత..

సర్వే నంబర్ 489లోని విలువైన ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించడమే కాకుండా, అక్కడ షెడ్లు నిర్మించి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన అధికారులు, అక్రమంగా నిర్మించిన ఓ భారీ షెడ్డును కూల్చివేశారు. "ప్రభుత్వ భూమి ఎవరి సొత్తు కాదు.. ఇక్కడ అక్రమ కట్టడాలు నిర్మిస్తే సహించేది లేదు" అని అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు. మిగిలిన నిర్మాణాలకు త్వరలోనే నోటీసులు జారీ చేసి, సమగ్ర సర్వే నిర్వహించి ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తామని స్పష్టం చేశారు.

### సామాన్యుడికి ఒక రూలు.. నాయకుడికి మరో రూలా?

అధికారుల చర్యలు ఒకవైపు ప్రశంసలు పొందుతున్నా, మరోవైపు విమర్శలకు తావిస్తున్నాయి. కేవలం ఫిర్యాదు అందిన వాటినే తొలగిస్తూ, కళ్లముందే కనిపిస్తున్న ఇతర అక్రమ నిర్మాణాలను ఎందుకు వదిలేస్తున్నారని స్థానికులు గళమెత్తుతున్నారు. కొందరు స్థానిక రాజకీయ నాయకుల కనుసన్నల్లోనే ఈ భూదందాలు జరుగుతున్నాయని, రాత్రికి రాత్రే అక్కడ గోడలు, షెడ్లు వెలుస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పేదవాడు పొట్టకూటి కోసం చిన్నపాటి బడ్డీ కొట్టు పెట్టుకుంటే నిబంధనలు గుర్తుకు తెచ్చే అధికారులు, బడా నేతల ఆక్రమణల వద్దకు వెళ్లడానికి ఎందుకు జంకుతున్నారని ప్రశ్నిస్తున్నారు.

### సమగ్ర సర్వే జరగాల్సిందే..

అన్నారం దర్గా చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలంటే ఎవరి ఒత్తిళ్లకు లొంగకుండా పూర్తిస్థాయిలో సర్వే జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆక్రమణదారుల హోదా ఏదైనా సరే, ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

## మత్తుకు దూరంగా.. చదువుకు దగ్గరగా ఉండాలి

◻ డాక్టర్ అనితా రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మత్తు పదార్థాల వినియోగం, విక్రయం చట్టరీత్యా నేరమని, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అనురాగ్ సొసైటీ చైర్మన్, కేయూ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండలోని ప్రభుత్వ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో అనాథ, సెమీ ఆర్ఫన్, వీధి బాలురకు నిర్వహించిన 'యాంటీ డ్రగ్స్ అబ్యూస్' అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. మత్తు పదార్థాల బారిన పడి ఎంతోమంది యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దు. ఎవరైనా ప్రలోభపెట్టి ఏ వస్తువు ఇచ్చినా తీసుకోవద్దు" అని విద్యార్థులను హెచ్చరించారు. ప్రతి పాఠశాల, కళాశాలలో తప్పనిసరిగా యాంటీ రాగింగ్, యాంటీ డ్రగ్ అబ్యూస్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే తక్షణమే 100 లేదా 1098 నంబర్లకు ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల చేత "మత్తు పదార్థాల జోలికి వెళ్లబోము" అని ప్రతిజ్ఞ చేయించారు. చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా చదివి లక్ష్యాన్ని సాధించాలి. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా యాంటీ డ్రగ్ అబ్యూస్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దీప, అరుణ, ఉప్పలయ్య, ప్రసన్న కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రంలోని విశ్వ జెనిత్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు శనివారం స్వయం పరిపాలన దినోత్సవం అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా మారి పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ హోదాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించారు. డీఈఓగా అల్తాఫ్, ఎంఈఓగా పవన్, ప్రిన్సిపాల్‌గా గాయత్రి, ఇంచార్జిగా మహేష్ తమ విధులను అత్యంత సమర్థవంతంగా నిర్వహించి అందరి ప్రశంసలు అందుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎర్రబెల్లి హరికుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి యొక్క విశిష్టతను, పాఠశాల నిర్వహణలో ఉండే సవాళ్లను విద్యార్థులకు ప్రాథమిక దశలోనే అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. బాధ్యతలను విజయవంతంగా నిర్వహించిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా డిక్షనరీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.




## పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ

**వరంగల్ వాయిస్, దామెర :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న వరంగల్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో నడికూడ మండలం పులుకుర్తి గ్రామంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రత్యేక శిబిరం శనివారం అత్యంత ఉత్సాహంగా ప్రారంభమైంది. గ్రామ పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణే లక్ష్యంగా విద్యార్థులు చేపట్టిన ఈ కార్యక్రమం స్థానికుల్లో అమితాసక్తిని రేకెత్తించింది. శిబిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

తడి, పొడి చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ రహిత గ్రామం, ఆరోగ్యకరమైన పరిసరాల ప్రాముఖ్యతపై నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా అతిథులు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థాన అధిపతి (ఏడీఆర్) డాక్టర్ ఆర్.ఉమారెడ్డి, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.రవీంధర్ నాయక్, టీఆర్వీకే కోఆర్డినేటర్ డాక్టర్ విజయభాస్కర్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యతను అలవర్చుకోవడం గొప్ప విషయమని, గ్రామాల అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు.

శిబిరంలో భాగంగా సాయంత్రం వేళ విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి వ్యవసాయ సామాజిక ఆర్థిక సర్వే నిర్వహించారు. రైతుల జీవనశైలి, సాగు పద్ధతులు, ఆదాయ మార్గాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరాలు సేకరించారు. రైతులు కూడా ఎంతో ఉత్సాహంగా విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ బి.రాజు, కె.గోపిక, ఏఈఓ రామకృష్ణ, స్థానిక నాయకులు కొత్త భాస్కర్, దండు సృజన రాజు, కార్యదర్శి శ్రీను, గ్రామ పెద్దలు పెంచాల రాజేందర్, గోపు రమేష్, కాషెట్టి రాజు, లక్ష్మయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.



## దుంపల ఆదిరెడ్డి మృతిపై కీర్తి రెడ్డి సంతాపం

**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన దుంపల ఆదిరెడ్డి శుక్రవారం మరణించగా, శనివారం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి వారి నివాసానికి చేరుకుని ఆదిరెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ పరామర్శలో కీర్తి రెడ్డి వెంట బీజేపీ రాష్ట్ర నాయకులు రాయరాకులు మొగిలి, మండల అధ్యక్షులు రామకృష్ణ, ముఖ్య నాయకులు కానుగుల నాగరాజు, ఉప్పు రాజు, రమణారెడ్డి, సమ్మయ్య, గిద్దమరి సురేష్, రాజశేఖర్, చంద్రమౌళి, ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

**వరంగల్ వాయిస్, దామెర :** కష్టాల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడమే నిజమైన సేవలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ నాయకులు బండి సతీష్ ముదిరాజ్ చాటిచెప్పారు. దామెర మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన కందుగుల సారయ్య ఇటీవల మరణించగా, శనివారం వారి కుటుంబాన్ని సతీష్ ముదిరాజ్ పరామర్శించారు. సారయ్య కుమారులు సదయ్య, గ్రామ పంచాయతీ కార్మికుడు కుమారస్వామిలను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో వారికి బాసటగా నిలుస్తూ, తన వంతు సహాయంగా 50 కిలోల బియ్యం పంపిణీ చేశారు. ఆ కుటుంబానికి భవిష్యత్తులోనూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బండి సతీష్ ముదిరాజ్ వెంట పోలెపాక రమేష్, పోలెపాక రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.





## 'కళ్యాణ లక్ష్మి' చెక్కుల పంపిణీ

**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కొండంత అండగా నిలుస్తున్నాయని కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ అన్నారు. శనివారం కమలాపూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో 60 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆడబిడ్డల పెళ్లిళ్లు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ఆర్థిక సహాయాన్ని అందజేస్తోందని తెలిపారు. లబ్ధిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్, ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం స్థానిక విశ్వ భారతి పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో ముందస్తుగా 'జాతీయ మహిళా దినోత్సవ' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ సేవలో ముందుంటున్న మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్, కమలాపూర్ సర్పంచ్ పబ్బు రాణి సతీష్‌లను పాఠశాల కరస్పాండెంట్ మధు, ప్రిన్సిపాల్ రాజు ఘనంగా సన్మానించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, వారికి సమాజంలో తగిన గుర్తింపు లభించాలని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు.



## లక్ష్య సాధనకు పేదరికం అడ్డుకాదు

□ మురళీధర్ రెడ్డి

**వరంగల్ వాయిస్, వేలేరు :** విద్యార్థుల్లో పట్టుదల ఉంటే ఉన్నత లక్ష్యాలను సాధించడానికి పేదరికం ఏమాత్రం ఆటంకం కాదని వంశీ రెడ్డి ఫౌండేషన్ డైరెక్టర్ కె.మురళీధర్ రెడ్డి అన్నారు. శనివారం వేలేరులోని తెలంగాణ గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సుమారు రూ.50 వేల విలువైన ఎగ్జామ్ మెటీరియల్, గ్రంథాలయానికి అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలను ఫౌండేషన్ తరపున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ.. పుట్టిన ఊరికి సేవ చేయాలనే తలంపుతో తన కుమారుడు వంశీ రెడ్డి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సరైన ప్రోత్సాహం అందిస్తే వారు మట్టిలో మాణిక్యాల్లా రాణిస్తారని ఆకాంక్షించారు. మెడికల్, ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురైతే, తమ ఫౌండేషన్ తరపున సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. కార్యక్రమ అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ రౌతు అజయ్ కుమార్, విశిష్ట అతిథిగా హాజరైన ధర్మసాగర్ కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ఉన్నతికి సహకరించే సమాజం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల బాధ్యతగా ఉండాలని సూచించారు. వంశీ రెడ్డి ఫౌండేషన్ అందించిన మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వంశీ రెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు వేణుమాధవ్, పిన్నింటి విజయ్, మల్లారెడ్డి, మధుకర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులను అక్రమంగా విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఆత్మకూరు పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. మండలంలోని పెంచికలపేట గ్రామంలో శనివారం గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోష్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. పెంచికలపేట గ్రామానికి చెందిన బిట్ల మధుకర్ తన 'శ్రీరామ కిరాణం' షాపులో నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులను నిల్వ ఉంచి విక్రయిస్తున్నాడు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు అందిన పక్కా సమాచారంతో సదరు షాపులో తనిఖీలు చేపట్టారు. ఈ దాడిలో అంబర్, గుట్కా, ఆర్.ఆర్, అన్నార్ టొబాకో ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పొగాకు ఉత్పత్తుల విలువ సుమారు రూ.4,300 ఉంటుందని అధికారులు వెల్లడించారు. నిందితుడు మధుకర్‌ను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు ప్రవీణ్, శ్రీనివాస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- కార్యాలయాల్లో పరిశుభ్రత ఉండాలి
- క్షేత్రస్థాయిలో కలెక్టర్ దివాకర్ టీఎస్ తనిఖీలు



**వరంగల్ వాయిస్, ములుగు** : ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, ప్రభుత్వ కార్యాలయాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా శనివారం ఆయన ములుగు మున్సిపాలిటీ పరిధిలో విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి పనులను, ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, వంటగది, స్టోర్ రూమ్, త్రాగునీటి శుద్ధి కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం నాణ్యతను స్వయంగా తనిఖీ చేసి, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.

విద్యార్థులతో ముచ్చటించిన ఆయన, వసతులు, ఉపాధ్యాయుల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇంటర్ పరీక్షల్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచేలా విద్యార్థులు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. పత్తిపల్లి రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన కలెక్టర్, రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ లైన్లను వెంటనే షిఫ్టింగ్ చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో స్థానిక కౌన్సిలర్లకు, ప్రజా ప్రతినిధులకు ముందస్తు సమాచారం అందించాలని స్పష్టం చేశారు. అనంతరం ఇరిగేషన్, మిషన్ భగీరథ కార్యాలయాలను సందర్శించి, పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన క్లియర్ చేయాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని హెచ్చరించారు.

నూతన కలెక్టరేట్ ఎదురుగా జరుగుతున్న లైసెన్స్ డ్ సర్వేయర్ల ప్రాక్టికల్ శిక్షణను పరిశీలించిన కలెక్టర్, డిజిటల్ పరికరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. భూ సర్వేలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా అత్యంత ఖచ్చితత్వంతో పనిచేయాలని సర్వేయర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్ జి, ఆర్డీవో వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ రమేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పరకాలలో 'కృషి విజ్ఞాన కేంద్రం' ఏర్పాటు చేయాలి

**రైతు సంఘాల డిమాండ్**




**వరంగల్ వాయిస్, పరకాల** : పరకాల డివిజన్ కేంద్రంగా కృషి విజ్ఞాన కేంద్రాన్ని (కేవీకే) ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం, రైతు రక్షణ సమితి నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పరకాల పట్టణంలోని అమరధామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వరికల కిషన్ రావు ప్రెస్ నోట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరకాల డివిజన్ పరిధిలోని శాయంపేట, రేగొండ, మొగుళ్లపల్లి, నడికూడ తదితర మండలాల్లోని సుమారు 120 గ్రామాల రైతులు తమ పంటలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం వరంగల్‌లోని ఆర్ఏఆర్ ఎస్ కు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పరకాలలో కృషి విజ్ఞాన కేంద్రం అందుబాటులోకి వస్తే, స్థానిక రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు అందుతాయని పేర్కొన్నారు. నడికూడ మరియు ఇతర మండలాల్లో ఈ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ భూమి కూడా సిద్ధంగా ఉందని వారు గుర్తుచేశారు. హనుమకొండ జిల్లాకు కేటాయించిన ఈ కేంద్రాన్ని పరకాలలోనే నిర్మించేలా స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్, అగ్రికల్చర్ యూనివర్సిటీ అధికారులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు అందుబాటులో ఉండే విధంగా పట్టణ పరిసర ప్రాంతాల్లోనే దీనిని నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఊరటి అంశాలరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు సోమిడి సాంబయ్య, గూడ సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

# రైతు నోట్లో మట్టి కొట్టిన దొంగలు

- మల్లక్కపేటలో 5 క్వింటాళ్ల మిర్చి మాయం





**వరంగల్ వాయిస్, పరకాల** : రైతు ఆకాశం వైపు చూస్తూ.. చెమటోడ్చి పండించిన పంటను అమ్ముకుందామనే సమయానికి దొంగలు కన్నం వేశారు. పరకాల మండలంలోని మల్లక్కపేట గ్రామంలో శనివారం మిర్చి దొంగతనం కలకలం రేపింది. చేతికొచ్చిన పంటను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లడంతో బాధిత రైతు కన్నీరుమున్నీరవుతున్నాడు. గ్రామానికి చెందిన రైతు దొమ్మటి బాబు తన వ్యవసాయ భూమిలో పండించిన మిర్చిని కోసి, మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేశాడు. ఇందులో భాగంగా బావి వద్ద మిర్చిని ఆరబోశాడు. అయితే, రాత్రికి రాత్రే గుర్తు తెలియని వ్యక్తులు అక్కడికి చేరుకుని సుమారు 5 క్వింటాళ్ల (10 బస్తాల) మిర్చిని ఎత్తుకెళ్లారు. తెల్లవారుజామున పొలానికి వెళ్లిన రైతు, అక్కడ మిర్చి కుప్పలు చిందరవందరగా పడి ఉండటం చూసి నిశ్చేష్టుడయ్యాడు. "నెలల తరబడి కష్టపడి, అప్పులు చేసి పండించిన పంట ఇది. మార్కెట్‌లో మంచి ధర ఉన్న సమయంలో అమ్మి అప్పులు తీర్చుకుందామనుకున్నాను. రాత్రికి రాత్రే పంట మాయం కావడంతో కోలుకోలేని ఆర్థిక నష్టం వాటిల్లింది" అని బాధిత రైతు దొమ్మటి బాబు వాపోయాడు. ఈ ఘటనతో మల్లక్కపేట గ్రామ రైతులు ఒక్కసారిగా భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో పంటలకు కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలపై ఆధారపడి జీవించే తమను ఇలాంటి దొంగతనాలు కోలుకోలేని దెబ్బ తీస్తాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి దొంగలను పట్టుకోవాలని, రైతులకు భద్రత కల్పించాలని కోరుతున్నారు.



# మహిళా ఉద్యోగులకు ఘన సన్మానం

**వరంగల్ వాయిస్, నడికూడ** : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నడికూడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ మరియు రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళా అధికారుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ రాణి, ఈజీఎస్ ఏపీఓ విద్యావతి, సీనియర్ సహాయకురాలు సరోజనలను అధికారులు ఘనంగా సత్కరించారు. వారితో పాటు పంచాయతీ కార్యదర్శులు భార్గవి, కరుణ, స్వప్న, వెన్నెల, శ్రావ్య, టెక్నికల్ అసిస్టెంట్లు కుసుమ, స్వప్న, రాధికలతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలను కూడా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీ రజనీకాంత్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈజీఎస్ సిబ్బంది, గోవిందు, నవీన్ కుమార్, దొంతుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- మండల సమాఖ్య సిబ్బందికి సన్మానం




**వరంగల్ వాయిస్, శాయంపేట** : నేటి పోటీ ప్రపంచంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తూ తమ శక్తిని చాటుతున్నారని సురేఖ మండల సమాఖ్య అధ్యక్షురాలు గడిపే సుమలత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమలత కేక్ కట్ చేసి, మహిళలకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళ లేనిదే సృష్టి లేదని, కుటుంబ ఆర్థికాభివృద్ధిలో మహిళా సంఘాల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. పొదుపు సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధిస్తూ, తమ కుటుంబాలను ఉన్నత స్థితికి చేరుస్తున్నారని ప్రశంసించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మండల సమాఖ్యలో విశేష సేవలు అందిస్తున్న సీసీ జిన్నా మంజుల, అకౌంటెంట్ గోలి అనిత, అటెండర్ పాపని మంజులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. మహిళా ఉద్యోగుల సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం వేణుగోపాలరావు, సీసీలు విజయకుమార్, శ్రీనివాసరావు, మండల సమాఖ్య కోశాధికారి దాసరి కల్పనాదేవి, వివిధ వివో అధ్యక్షురాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# రంజాన్ ఏర్పాట్లపై మేయర్ సమీక్ష



**వరంగల్ వాయిస్, హనుమకొండ** : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నగరంలో ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని సర్కిల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో ఆమె ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రంజాన్ పండుగ సందర్భంగా మసీదులు, ఈద్గాల పరిసరాల్లో ప్రత్యేక విద్యుత్ దీపాల (లైటింగ్) ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. నగరంలోని ప్రధాన కూడళ్లు, ప్రార్థనా మందిరాల వద్ద పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగాలని, తాగునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. పండుగ వాతావరణం ఉట్టిపడేలా మున్సిపల్ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రవి కుమార్, మాధవి లత, మహేందర్, డిప్యూటీ ఇంజినీర్ కార్తీక్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ములుగు మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తా

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- రూ.15 కోట్లతో అభివృద్ధి పనులకు టెండర్లు
- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో వెల్లడి



**వరంగల్ వాయిస్, ములుగు :** నూతనంగా ఏర్పడిన ములుగు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. అభివృద్ధి పనుల విషయంలో ప్రజలందరూ భాగస్వాములై సహకరించాలని ఆమె కోరారు. శనివారం ములుగు మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ములుగు నియోజకవర్గ రూపురేఖలు మారుస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పన కోసం ఇప్పటికే రూ.15 కోట్లతో టెండర్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, అనుమతులు వచ్చిన లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. అంతకుముందు ములుగు మండలం దేవగిరిపట్నం గ్రామంలో రూ.10 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న మహిళా సమాఖ్య భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం చింతలపూడి వినోద అనే లబ్ధిదారురాలు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ మహోత్సవంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. వెంకటాపూర్ మండలం ఎల్లారెడ్డి పల్లె గ్రామంలో మంత్రి సీతక్క విస్తృతంగా పర్యటించారు. రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. రూ.17.50 లక్షలతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీ నిర్మాణాలను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. గ్రామంలో పూసల యాదమ్మ-కుమారస్వామి దంపతుల ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి గృహ ప్రవేశం చేయించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్ సంపత్ రావు, మున్సిపల్ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ భిక్షపతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, ఆత్మ కమిటీ చైర్మన్ కొండ రవీందర్ రెడ్డి, పీఆర్ స్టేట్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, డీఆర్డీఓ శ్రీనివాస్, పీఆర్ ఈఈ అజయ్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లో మహిళా దినోత్సవ వేడుకలు

**వరంగల్ వాయిస్, కాజీపేట :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా కాజీపేటలోని ఎన్ఐటీ సమీపంలో ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ శాఖలో శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కుమార్తె డాక్టర్ శ్రీగోధ విష్ణు రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బ్యాంకులోని మహిళా ఉద్యోగుల మధ్య డాక్టర్ శ్రీగోధ కేక్ కట్ చేసి వారికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అంతరిక్షం వరకు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతుండటం గర్వకారణమని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. కాజీపేటలోని ఈ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ శాఖ పూర్తిగా మహిళా ఉద్యోగుల చేత నిర్వహించబడటం విశేషమని, ఇది మహిళా సాధికారతకు ఒక ఉత్తమ ఉదాహరణ అని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్, మహిళా సిబ్బంది, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

□ హనుమకొండలో భారీ మానవహారం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట భారీ మానవహారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వందలాది మంది ఉద్యోగులు తరలివచ్చి తమ నిరసనను గళమెత్తారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షులు కుసుమ సూర్య కిరణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దోయిపడి శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ యంత్రాంగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నా, వారికి సరైన గుర్తింపు లేకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. 2021 నుంచి ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా జీతం పెరగలేదని, పెరిగిన ధరల దృష్ట్యా ప్రస్తుత వేతనాలతో కుటుంబాలను పోషించడం భారంగా మారిందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. బిస్వాల్ కమిటీ సిఫార్సుల మేరకు ప్రతి ఏటా కనీసం ₹1,000 ఇంక్రిమెంట్ అందించాలి. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని దశల వారీగా రెగ్యులరైజ్ చేయాలి. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను పక్కాగా అమలు చేయాలి. విధుల్లో ఉండి మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక సహాయంతో పాటు, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి చర్చలకు పిలవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పులి రాజేష్, జిల్లా జేఏసీ ప్రతినిధులు లోకేష్, సతీష్, శ్రీనివాస్ అరూరి, గీత, లక్ష్మి, వంశీ, అనిల్, మురళి, సూరజ్, శ్వేత, చందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# స్వచ్ఛ వరంగల్ లక్ష్యం

- చీపురు పట్టిన మంత్రి, మేయర్, కలెక్టర్
- మహిళా శక్తికి 'కుట్టు' మిషన్ల ఊతం
- మంత్రి కొండా సురేఖ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, 'ఇందిరమ్మ మైనారిటీస్ మహిళా శక్తి' కార్యక్రమంలో భాగంగా శనివారం ఖిలా వరంగల్ మండలం శివనగర్‌లోని సాయి కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ లబ్ధిదారులకు కుట్టు మిషన్లను అందజేశారు. మహిళా శక్తిని చాటేలా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, పలువురు కార్పొరేటర్లు పాల్గొని మహిళా ఉద్యోగులకు, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.



అనంతరం 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) పరిధిలోని 35వ డివిజన్‌లో మంత్రి కొండా సురేఖ స్వయంగా పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. మేయర్, కలెక్టర్‌తో కలిసి వీధులను ఊడ్చి, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత, ప్రజలు చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందజేయాలి. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి నగరంలో స్వచ్ఛతను మెరుగుపరచాలి. పారిశుధ్యంపై ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు పల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, గుండు చందన, పోశాల పద్మ, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఇతర మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com